క్లుప్తంగా

శాస్త్రోక్తంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఐ.పోలవరం: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం చండీ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ హోమం ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో జరుగుతోంది. మాజీ చైర్మన్ పెన్మత్స వాసురాజు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గణపతి పూజ, పంచగవ్య ప్రాసన, చండీ హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలంటూ ధర్నా



డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాళ్లరేవు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ఇసుక లభించక పోవడంతో భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినప్పటికీ ఇసుక సమస్యను పరిష్కరించలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇసుక దందా నడుస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక సమస్యను పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నాలో వల్లు రాజబాబు, వడ్డి ఏడుకొండలు, విప్పర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఉచిత ఇసుక హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఉచిత ఇసుక హామీను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. తక్షణం ఇసుకను ప్రజలందరికీ అందుబాటులో తీసుకురావాలన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, టి.నాగవరలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



మునిపల్లిలో శానిటేషన్ పనులు చేయిస్తున్న సర్పంచ్

ఉప్పలగుప్తం: ప్రస్తుతం విష జ్వరాలు సంభవిస్తున్న నేపథ్యంలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని మునుపల్లిలో శానిటేషన్ కార్యక్రమం శుక్రవారం సిబ్బందితో నిర్వహించారు. జ్వరాలు సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని గ్రామస్తులకు వివరించారు

సర్వేయర్ ప్రసాద్ సేవలు ప్రశంసనీయం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్వేయర్ల సంఘం నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం మండల సర్వేయర్‌గా జేకేడీ ప్రసాద్ ఐదేళ్ల పాటు అందించిన సేవలు ప్రశంసనీయమని అమలాపురం మండల గ్రామ సర్వేయర్ల సంఘం నాయకులు కొనియాడారు. కొత్తపేట మండల సర్వేయర్‌గా బదిలీపై వెళుతున్న ప్రసాద్‌ను సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ప్రసాద్ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ తోటి ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ఎన్నో భూ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేశారు. అనంతరం మండల సర్వేయర్ ప్రసాద్‌కు శాలువ పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు మోసుగంటి శ్రీహర్ష, గంధం ఆదినారాయణ, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

- అడిగిన ప్రతి ప్రయాణికుడికీ టికెట్
- 100 సర్వీసులకు గ్రీన్‌సిగ్నల్



అమలాపురం డిపోలో సిద్ధంగా ఉన్న బస్సులు

అమలాపురం రూరల్: దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం అమలాపురం ఆర్టీసీ డిపో 100 ప్రత్యేక బస్సులు నడుపుతుంది. అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి డిపోలో శుక్రవారం ప్రత్యేక బస్సులపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు 12 సర్వీసులు నడుపుతున్నారు. దసరాకు అదనంగా 50 ప్రత్యేక బస్సులు నడుపుతారు. దసరా (ఈనెల 8 నుంచి 11 వరకు) 5 రోజుల పాటు 25 బస్సు సర్వీసులు హైదరాబాద్ నుంచి నడుపుతారు. అమలాపురం నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో అక్టోబర్ 12 నుంచి 15 వరకు మరో 25 సర్వీసులు నడుపుతారు. విజయవాడ ప్రస్తుతం సాధారణంగా 28 బస్సులు నడుపుతుండగా దసరాకు అదనంగా 25 బస్సులను నడుపుతారు. 8 నుంచి 12 వరకు రోజుకు 5 బస్సుల చొప్పున 25 బస్సులు, తిరుగు ప్రయాణంలో 12 నుంచి 15 వరకు 25 బస్సులు నడపనున్నారు. భవానీ భక్తులు కోరితే విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. విశాఖపట్నం రూట్లకు ప్రస్తుతం 23 బస్సులను నడుపుతుండగా అదనంగా 8 నుండి 11 వరకు 25 బస్సు సర్వీసులు నడుపుతారు. తిరుగు ప్రయాణంలో 12 నుంచి 15 వరకు 25 బస్సులు ఏర్పాటు చేశారు. దసరా సెలవులు, తిరుగు ప్రయాణాలు పురస్కరించుకుని ఏ ఒక్క ప్రయాణికుడికి అసౌకర్యం కలగకుండా రిజర్వేషన్లు లేవు, టిక్కెట్లు అయిపోయాయి వంటి సమాధానాలు లేకుండా ఎవరు ఎక్కడికి ఎన్ని టిక్కెట్లు అడిగినా డిపో నుంచి బస్సులు సిద్ధం చేస్తున్నారు.

ప్రైవేట్ బస్సుల్లో టికెట్ రూ.2 వేలు

ఇప్పటికే ప్రైవేటు ఆపరేటర్లు హైదరాబాద్‌కు రూ.1500 నుంచి రూ.1800 ధర ఆన్‌లైన్‌లో పెట్టారు. ఆర్టీసీలో అయితే అదనపు చార్జీలు లేకుండా రూ.900కే వెళ్లవచ్చు. గతేడాది దసరాకు 81 బస్సులు నడపగా రూ.24 లక్షల ఆదాయం లభించగా ఈసారి సుమారు 100–130 బస్సులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రయాణికులు వినియోగించుకోవాలి



దసరాలో ప్రయాణికులు నిశ్చింతగా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి. రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా టిక్కెట్లు ముందుగా బుక్ చేయించుకోవాలి. ప్రైవేట్ కంటే ఆర్టీసీలో తక్కువ రేట్లకే ప్రయాణించవచ్చు. దసరాకు 100 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

– చల్లా సత్యనారాయణ మూర్తి, డీఎం, అమలాపురం

ఓటర్ల జాబితా సవరణ సమర్థంగా రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025కు సంబంధించి నిర్దేశిత అన్ని ప్రక్రియలు సమర్థవంతంగా చేపట్టి కచ్చితత్వంతో కూడిన జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నియోజకవర్గాల ఓటర్ల నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఆర్వోలతో వీసీ ద్వారా సహాయ ఓటర్ నమోదు అధికారులనుతో ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 రివిజన్ కార్యక్రమాలైన ఇంటింటి సర్వే పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, తూర్పు పశ్చిమగోదావరి జిల్లా పట్ట భద్రుల ఓటరు జాబితా తయారీ అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు చైతన్యవంతులు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమలాపురం రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకుని చైతన్యవంతులు కావాలని అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి, న్యాయ సేవాదికార సంస్థ స్థానిక చైర్మన్ వి.నరేష్ పిలుపునిచ్చారు. న్యాయం పొందే విషయంలో మహిళా సాధికరాత సాధ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పోలీస్, న్యాయవాదుల సమక్షంలో శుక్రవారం జరిగిన మహిళా సాధికారత సమావేశంలో న్యాయమూర్తి నరేష్ మాట్లాడారు. మహిళలు న్యాయం విషయంలో అవగాహనతో ఉన్నప్పుడే సమాజం పురోగతితో సాగుతుందని డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ అన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో విజయ మాట్లాడుతూ మహిళలు ఒక్క న్యాయపరంగానే కాకుండా అన్ని అంశాలపై చొరవ చూపాలని సూచించారు. అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మాట్లాడుతూ మహిళలను చట్టపరంగా మేలు కొలుపే అంశాలను వివరించారు. డీఆర్‌డీఏ హెచ్‌ఆర్ డీపీఎం జి.విజయకుమార్, ఐసీడీఎస్ ఏపీఎం పీవీవీ రమణ, భగవాన్ నారాయణ, న్యాయవాదులు వి.భాస్కరశాస్త్రి, కేవీవీ శ్రీనివాసరావులు ప్రసంగించి మహిళా చైతన్యం గురించి వివరించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ర్యాలీ



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లరేవు: పర్యావరణాన్ని, వన్యప్రాణులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేస్తూ అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా స్థానిక అభయారణ్యం నుంచి కొబ్బరి చెట్టు పేట గ్రామం వరకూ వన్యప్రాణులను సంరక్షించాలి, పర్యావరణాన్ని కాపాడాలి అంటూ నినాదాలతో ర్యాలీ చేశారు. అనంతరం కాకినాడ వివేకానంద పార్కులోని లైబ్రరీలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్‌లు, శ్రీహర్ష, కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్లపై కేసు నమోదు

బహిరంగంగా బయటపడిన మట్టి మాఫియా

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లిలో జరుగుతున్న మట్టి మాఫియాలో పలువురు యూట్యూబర్‌లు, అక్రమంగా మట్టిని ముమ్మిడివరం ప్రాంతానికి తరలిస్తున్న లారీ డ్రైవర్‌కు మధ్య జరిగిన వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సీహెచ్ రాజేష్ శుక్రవారం తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం అర్ధరాత్రి వేళలో పెదగాడవిల్లి నుంచి మట్టిని టిప్పర్ లారీలో తరలిస్తూ తనను లారీతో ఢీకొని గాయపరిచాడంటూ రమణ అనే యూట్యూబర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లారీ డ్రైవర్ దుర్గాప్రసాద్‌పై ఫిర్యాదు చేశాడు. తాము చేసుకుంటున్న పనిలో రమణ, జాన్ రత్నం, నాగశేఖర్ అనే వ్యక్తులు విలేకరులమంటూ వచ్చి నగదు డిమాండ్ చేసి భయభ్రాంతులకు గురి చేశారంటూ లారీ యజమాని రెడ్డి శ్రీనివాసరావు దానికి దీటుగా ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేష్ తెలిపారు.

బస్సు పాస్ కౌంటర్ నిలిపివేత

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో బస్సు పాస్ కౌంటర్‌ను రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ వెబ్ సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునీకరణలో భాగంగా శనివారం, ఆదివారాల్లో నిలిపి వేస్తామన్నారు. సోమవారం యథావిధిగా బస్‌పాస్‌ల కౌంటర్‌లో అందిస్తామన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు సహకరించాలని డీఎం సత్యనారాయణమూర్తి కోరారు.

సమస్యలపై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వినతి



పుదుచ్చేరి సీఎం రంగసామిని కలిసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి సీఎం రంగసామితో సమావేశమయ్యారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన కుటుంబాలకు 66 మందికి గాను 14 కుటుంబాలకు రూ.50 వేలు మొత్తాన్ని జమ చేశారని తెలిపారు. మిగిలిన 42 కుటుంబాలకు ఆర్థిక సహాయం ఇప్పటి వరకు అందలేదని ఈ సమస్యపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తాను ప్రస్తావించినట్టు తెలియజేశారు. ఓఎన్జీసీ నష్ట పరిహారానికి సంబంధించి ప్రభుత్వ ఖాతాలో జమ చేసిన సొమ్మును త్వరితగతిన లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మత్స్య శాఖ మంత్రిని కలసిన ఎమ్మెల్యే

నియోజకవర్గ మత్స్యకారులకు ఓఎన్జీసీ అందించాల్సిన రెండో విడతకు సంబంధించి 9 నెలల పరిహారం గురువారం ప్రభుత్వ ఖాతాల్లో జమైందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన పుదుచ్చేరి మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 5,289 మంది లబ్ధిదారులకు నెలకు రూ.11,500 చొప్పున రూ.54 కోట్ల 74 లక్షల 11 వేల 500 మొత్తాన్ని అతి త్వరలో ప్రభుత్వ అనుమతితో మత్స్యకారుల ఖాతాలో జమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా గతంలో 179 లబ్ధిదారుల పేర్లు తొలగించారని వారికి కూడా నష్ట పరిహారం చెల్లించాలని తాను మంత్రి లక్ష్మీనారాయణకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

కనకాలపేట డంపింగ్ యార్డు తొలగించాలి

స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. నియోజకవర్గానికి చెందిన వివిధ సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించారు. కనకాలపేట డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. రోజుకు వేలాది టన్నుల వ్యర్థాలను ఈ డంపింగ్ యార్డులో వేయడం వల్ల పరిసర కనకాలపేట, భీమనగర్, యూకేవీ నగర్, బైపాస్ వెంబడి నివసించే వారు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వ భూమిని సర్వే చేసి ఎన్నో ఏళ్లుగా నివేశన స్థలాల కోసం ఎదురు చూస్తున్న నియోజకవర్గ పేదలకు పట్టాలు పట్టాలు ఇవ్వాలని కోరారు. అప్పటి ఎల్జీ తమిళిసై సౌందరాజన్ 2022లో ఇచ్చిన హామీ మేరకు యానాం ఏటిగట్టు వెంబడి వరద రక్షణ గట్టు నిర్మించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. అనంతరం స్థానిక సంస్థలు, విద్యాశాఖ కార్యదర్శి జవహర్‌తో కూడా యానాం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య కార్మి కుల జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు.

కోనసీమ ఎక్స్ సర్వీస్ మెన్ సభ్యుల రూ.లక్ష విరాళం

అమలాపురం టౌన్: విజయవాడ వరద బాధితుల కోసం కోనసీమ ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని సమకూర్చారు. ఈ విరాళానికి సంబంధించిన రూ.లక్ష చెక్‌ను రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు శుక్రవారం అమలాపురంలో అందజేశారు. ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.శ్రీనివాసరావు, డీఎస్ మూర్తి, రాంబాబు, ఎంఎస్ నారాయణ, దుర్గాప్రసాద్ చెక్‌ను మంత్రికి అందించారు.

బాలాత్రిపుర సుందరీ నమోస్తుతే..

- కొన్ని ఆలయాల్లో గాయత్రీదేవిగా..
- భక్తుల ప్రత్యేక పూజలు



బాలాత్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు



గాయత్రీదేవిగా దర్శనిమిస్తున్న అమలాపురం కన్యకా పరమేశ్వరిదేవి



యానాంలో బ్రహ్మచారిణి అలంకరణలో శారదాదేవి



నీలపల్లిలో గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

అమలాపురం టౌన్: పట్టణంలో శరన్నవరాత్ర ఉత్సవాలు పలు చలువ పందిళ్లలో రెండో రోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు పలు అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో పలు రకాల హోమాలు జరిగాయి. శ్రీదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు సేవలు అందిస్తున్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీమాత ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు శరన్నవరాత్ర ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవైష్ణవి కనకదుర్గ ఆలయంలో అమ్మవారు, స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ఆడపడుచులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక గోల్డ్ మార్కెట్ వినాయక గుడి వద్ద ఉన్న కామాక్షీ ఏకాంబరేశ్వరదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో ఈ ఆలయం వద్ద శరన్నవరాత్ర మహోత్సవాలు జరుగుతున్నాయి. శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద రోజూ మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరుగుతోంది. ప్రతిరోజు కొందరు భక్తులు ముందుకు వచ్చి వేలాది మంది భక్తులకు అన్నసమారాధన చేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. నారాయణపేట, కొంకాపల్లి, సూర్యనగర్, సావరం తదితర ప్రాంతాల్లోని కనకదుర్గ ఆలయాల వద్ద కూడా శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి భవానీ భక్తుల పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రాయుడు సూరిబాబు, కుసుమ దంపతుల ఆధ్వర్యంలో గురుభవానీలు పిల్లి నాని, కదలి సింహాద్రిల నేతృత్వంలో భవానీమాల ధరించిన భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భవానీలు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బ్రహ్మచారిణి అలంకరణలో..

యానాం: శారదాదేవి సరస్వతీదేవి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా యానాం పట్టణంలో గోపాల్‌నగర్‌లో కొలువైన శారదాదేవి అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పడాల వెంకటసత్య వేణుగోపాలరావు దంపతుల సౌజన్యంతో విశేషపూజలు నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వానపల్లిపాలెంలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు చేసి అమ్మవారికి నైవేద్యాలు చెల్లించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా కోటి కుంకుమార్చన

అమలాపురం టౌన్: స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద ఉన్న పురాతన క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులూ మహిళలతో కోటి కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్ర మహోత్సవాల రెండో రోజు శుక్రవారం తెల్లవారుజాము నుంచి దాదాపు 200 మంది మహిళలు పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష కుంకుమార్చన చేశారు. అమ్మవారిని పలు రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కూచిమంచి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది కూచిమంచి మల్లపరాజు, ట్రస్ట్ సభ్యుడు, న్యాయవాది కూచిమంచి శశిధర్ భక్తులకు సేవలు అందించారు.

ఘనంగా బాలపూజ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో ఉన్న పాలకనకదుర్గ ఆలయంలో బాలపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్ర మహోత్సవాల రెండో రోజైన శుక్రవారం దుర్గా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాలు, మంటపాల్లో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. దండుప్రోలు సుబ్బారావు, కర్రి సత్యానందం దంపతులచే అశేష భక్తుల నడుమ బాలికకు పాదపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



జార్జిపేటలో పడిపూజలో పాల్గొన్న భవానీలు



అమలాపురంలో బాలాత్రిపుర సుందరికి కోటి కుంకుమార్చనలు



వానపల్లిపాలెంలో విజయదుర్గమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

విద్యార్థులను ఆలోచింపజేసిన ప్రయోగాలు



సైన్స్ ప్రయోగాలు చేస్తున్న జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు

యానాం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడం ద్వారా భవిష్యత్తులో వారు ఉన్నతులుగా తయారవుతారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్ పేర్కొన్నారు. శుక్ర వారం జనవిజ్ఞాన వేదిక యానాం శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా బ్లాక్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ద్వారా సైన్స్‌పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలగజేయడం లక్ష్యంగా సాగుతుందన్నారు. యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా యానాంలో జనవిజ్ఞాన వేదిక ద్వారా వివిధ సైన్స్ సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రేవతి ఫౌండేషన్ అధినేత కె.కృష్ణసాయి మాట్లాడుతూ విద్యార్థులకు భౌతికశాస్త్రంలో ధ్వని, నీరు, నిప్పుధర్మాలు, రసాయనిక శాస్త్ర ప్రయోగాలు లోకాస్ట్, నోకాస్ట్ పద్ధతిలో సులువుగా అవగాహన చేసుకునేలా వివరించారు. అనంతరం డాక్టర్ చల్లా రవికుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు, ఆర్ కృష్ణారావు, మోహిబుల్లాఖాన్, ఇన్‌చార్జి హెచ్ఎం సుజిదా భాను, దంగేటి త్రిమూర్తులు, సాయిరాం, నాగేంద్ర, మానసి, టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లి పంచాయతీ పరిధి వల్లాయిచెరువు ప్రాంతంలో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు 5 వ్యక్తులను అరెస్టు చేసి రూ.3440 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు.